విదేశాంగ మంత్రి ఘనా, కోట్ డి'ఐవరీ, ఇథియోపియా దేశాల్లో పర్యటన (2026 అక్టోబర్ 06–10)

విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ 2026 అక్టోబర్, 06-10 తేదీలలో ఘనా, కోట్ డి'ఐవరీ మరియు ఇథియోపియాకు అధికారిక పర్యటన చేశారు.

ఘానా

2. ఈ పర్యటన సందర్భంగా, భారత విదేశాంగ మంత్రి (ఇఎఎం) ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామాను కలిసి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. 2025 జూలైలో ప్రధానమంత్రి మోదీ ఘనాలో జరిపిన చారిత్రాత్మక పర్యటన అనంతరం భారత్–ఘనా భాగస్వామ్యంలో నెలకొన్న బలమైన పురోగతిపై ఇరువురు నేతలు చర్చించారు. భారత విదేశాంగ మంత్రి, ఘనా విదేశాంగ మంత్రి శామ్యూల్ ఒకుడ్జెటో అబ్లాక్వాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి, వాణిజ్యం మరియు పెట్టుబడులు, అభివృద్ధి భాగస్వామ్యం, ఔషధ రంగం, సామర్థ్య నిర్మాణం, రక్షణ, సాంకేతికత మరియు ప్రజల మధ్య సంబంధాలలో సహకారాన్ని సమీక్షించారు. పశ్చిమ ఆఫ్రికా, ఇసిఒడబ్లుఎఎస్, ఆఫ్రికన్ యూనియన్, యుఎన్ సంస్కరణలు మరియు గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాల కోసం సహకారం వంటి అంశాలపై ఇరుపక్షాలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. విదేశాంగ మంత్రి ఘనా అంతర్గత వ్యవహారాలు, విద్య, మత్స్య మరియు ఆక్వాకల్చర్, పర్యాటకం, సంస్కృతి, సృజనాత్మక కళల శాఖల మంత్రులను కూడా కలిశారు. అలాగే, ఘనాలోని భారతీయ సమాజ సభ్యులతో, భారత సాంకేతిక మరియు ఆర్థిక సహకార కార్యక్రమం (ఐటిఇసి) కింద శిక్షణ పొందుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో విదేశాంగ మంత్రి సమావేశమై, వారితో పరస్పరం మాట్లాడారు.

3. ఉమ్మడి మీడియా సంభాషణ సమయంలో పరిహార న్యాయం, సాంస్కృతిక సంపద పునరుద్ధరణ వంటి అంశాల్లో ఘనా నాయకత్వాన్ని, ముఖ్యంగా సంబంధిత ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆ దేశం పోషించిన పాత్రను ఇఎఎం ప్రశంసించారు. భారతదేశం జి20 అధ్యక్షత వహించిన సమయంలో ఆఫ్రికన్ యూనియన్‌కు జి20లో శాశ్వత సభ్యత్వం లభించేందుకు భారత్ పోషించిన నిర్మాణాత్మక పాత్రను, అందించిన సహకారాన్ని ఘనా గుర్తించింది. విద్యా రంగం, శాస్త్రీయ

పరిశోధన, సామర్థ్య నిర్మాణంలో సహకారం, అలాగే వ్యవసాయ పరిశోధన మరియు విద్యకు సంబంధించిన రెండు ఎంఒయులపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. “ఏక్ పేడ్ మా కే నామ్” మరియు “ట్రీ ఫర్ లైఫ్” కార్యక్రమాలకు మద్దతుగా విదేశాంగ మంత్రి మరియు ఘనా విదేశాంగ మంత్రి అబ్లాక్వా కలిసి ఘనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రాంగణంలో ఫ్లూమేరియా మొక్కను నాటారు. "భారత్, ఘనా మరియు గ్లోబల్ సౌత్” అనే అంశంపై విదేశాంగ మంత్రి ఘనా ఫారిన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రసంగించారు. అనంతరం క్వామే న్క్రుమా మెమోరియల్ పార్కును సందర్శించారు. అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్‌లో చేరేందుకు ఘనా ఆమోద పత్రాన్ని కూడా ఆయన స్వీకరించారు. భవిష్యత్తులో పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు ఔషధాలు మరియు ఆరోగ్య రంగం, గనుల తవ్వకం, రక్షణ, రైల్వేలు, డిజిటల్ సాంకేతికత, వ్యవసాయ యాంత్రీకరణ, ఉత్పత్తులకు విలువ జోడింపు, పారిశ్రామికీకరణ మరియు ఉపాధి కల్పన వంటి రంగాలను ఇరుపక్షాలు ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించాయి.

కోట్ డి'ఐవరీ

4. ఈ పర్యటన సందర్భంగా, ఇఎఎం కోట్ డి'ఐవరీ అధ్యక్షుడు అలసానే ఔట్టారాతో భేటీ అయ్యారు మరియు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తరఫున వ్యక్తిగత శుభాకాంక్షలు తెలియజేశారు. బలమైన, సుస్థిరమైన, పరస్పర ప్రయోజనకరమైన భాగస్వామ్యంపై తన దార్శనికతను పంచుకున్నందుకు అధ్యక్షుడికి విదేశాంగ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. విదేశాంగ మంత్రి, ఉపప్రధాని మరియు రక్షణ మంత్రి టెనె బిరాహిమా ఔట్టారాతో సమావేశమై, అభివృద్ధి చెందుతున్న రక్షణ మరియు భద్రతా భాగస్వామ్యంపై చర్చించారు. విదేశాంగ మంత్రి, విదేశీ వ్యవహారాలు మరియు అంతర్జాతీయ సహకార శాఖ సహాయ మంత్రి నియాలే కాబాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలను సమీక్షించడంతో పాటు, వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం మరియు వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు, డిజిటల్ సాంకేతికత, ఇంధనం, మౌలిక సదుపాయాలు, విద్య మరియు సామర్థ్య నిర్మాణ రంగాల్లో సహకార అవకాశాలను చర్చించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1.5 బిలియన్ అమెరికన్ డాలర్లను మించిందని ఇరుపక్షాలు గుర్తించాయి. పెట్టుబడులు, స్థానిక తయారీ, ప్రాసెసింగ్ మరియు ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా ఈ వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలను

పరిశీలించాయి. అలాగే, ప్రాంతీయ మరియు ప్రపంచ పరిణామాలపై ఇరుపక్షాలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. దక్షిణ–దక్షిణ సహకారానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించడంతో పాటు, అంతర్జాతీయ వేదికలపై ఆఫ్రికా మరియు గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశాయి.

5. ఈ పర్యటన సందర్భంగా, భారతదేశంలో శిక్షణ మరియు సామర్థ్య నిర్మాణ కోర్సులను పూర్తి చేసిన భారత సాంకేతిక మరియు ఆర్థిక సహకార కార్యక్రమం (ఐటిఇసి) పూర్వ విద్యార్థులతో విదేశాంగ మంత్రి (ఇఎఎం) సమావేశమై, వారితో మాట్లాడారు. ఈ సమావేశంలో కోట్ డి'ఐవరీ జాతీయ విద్య, అక్షరాస్యత మరియు సాంకేతిక విద్యా శాఖ మంత్రి ఎన్‌గెస్సాన్ కొఫీ కూడా పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సామర్థ్య నిర్మాణం మరియు నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని ఈ సమావేశంలో స్పష్టం చేశారు.

6. విదేశాంగ మంత్రి కోట్ డి'ఐవరీలోని భారతీయ సమాజ సభ్యులతో కూడా సమావేశమయ్యారు. ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి, అలాగే రెండు దేశాల మధ్య స్నేహ సంబంధాలు, ప్రజల మధ్య పరస్పర సంబంధాలను బలోపేతం చేయడంలో వారు అందిస్తున్న సహకారాన్ని ఆయన ప్రశంసించారు.

7. ఈ పర్యటన భారత్ మరియు కోట్ డి'ఐవరీ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలకు నూతన ఊపునిచ్చింది. అలాగే, పరస్పర ప్రయోజనకరమైన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించి, బలోపేతం చేయాలనే ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను స్పష్టం చేసింది.

ఇథియోపియా

8. ఈ పర్యటన సందర్భంగా, విదేశాంగ మంత్రి ఇథియోపియా ఫెడరల్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ప్రధానమంత్రి డా. అబీ అహ్మద్ అలీని కలిసి, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తిరిగి ప్రధానమంత్రిగా ఎన్నికైన డా. అబీకి విదేశాంగ మంత్రి అభినందనలు తెలిపారు. పరస్పర ప్రయోజనాలు మరియు ఉమ్మడి ప్రాధాన్యతల ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలను

మరింత బలోపేతం చేసేందుకు భారతదేశం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. అలాగే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత సందేశాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం, విదేశాంగ మంత్రి ఇథియోపియా విదేశాంగ మంత్రి డా. గెడియన్ టిమోథెవోస్‌తో విస్తృత స్థాయిలో, ఫలవంతమైన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా భారత్–ఇథియోపియా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలను ఇరువురు నేతలు సమీక్షించారు. వాణిజ్యం మరియు పెట్టుబడులు, వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, రక్షణ, గనుల తవ్వకం, కృత్రిమ మేధస్సు మరియు డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారు. అలాగే, ప్రాంతీయ పరిణామాలు మరియు పరస్పర ఆసక్తి కలిగిన ప్రపంచ సమస్యలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

9. విదేశీ వ్యవహారాల మంత్రి ఇథియోపియాలోని నేషనల్ ప్యాలెస్ మ్యూజియం, సైన్స్ మ్యూజియం మరియు ఇథియోపియన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్‌స్టిట్యూట్‌లను కూడా సందర్శించారు. అదనంగా, ఆయన అద్వా విక్టరీ మ్యూజియాన్ని సందర్శించి, అక్కడి అద్వా విక్టరీ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించారు. అద్వా విక్టరీ మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ప్రభుత్వ అధికారులు, దౌత్యవేత్తలు మరియు విద్యావేత్తలను ఉద్దేశించి విదేశాంగ మంత్రి ప్రసంగించారు. తన బహిరంగ ఉపన్యాసంలో, ఆఫ్రికాతో భారతదేశానికి ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు. అలాగే, సమకాలీన బహుపాక్షిక సహకారాన్ని రూపొందించడంలో గ్లోబల్ సౌత్ దేశాల సమిష్టి పాత్రను ఆయన నొక్కిచెప్పారు.

10. ఇథియోపియాతో భారత్‌కు ఉన్న బలమైన అభివృద్ధి భాగస్వామ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇఎఎం తదుపరి జైపూర్ ఆర్టిఫిషియల్ లింబ్ ఫిట్‌మెంట్ క్యాంప్ తదుపరి విడతను ఇథియోపియాలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇది 2024లో ఇథియోపియాలోని అఫార్ ప్రాంతంలో విజయవంతంగా నిర్వహించిన శిబిరానికి కొనసాగింపుగా చేపట్టనున్నారు. ఆ శిబిరం ద్వారా సుమారు 450 మంది లబ్ధిదారులకు కృత్రిమ అవయవాలను అందించారు. మానవ వనరుల అభివృద్ధి పట్ల భారతదేశం తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, ఫోరెన్సిక్ శాస్త్రాలు, మహిళా మరియు శిశు అభివృద్ధి, మీడియా పాలన రంగాల్లో ఇథియోపియా అధికారుల కోసం ప్రత్యేక శిక్షణా కోర్సులను భారత్ అందించింది.

11. అడిస్ అబాబాలో ఉన్న సమయంలో, విదేశాంగ మంత్రి ప్రాంతీయ అధిపతుల సమావేశానికి కూడా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆఫ్రికా ఖండంలోని వివిధ దేశాల్లో పనిచేస్తున్న భారత రాయబారులు మరియు హైకమీషనర్లు పాల్గొన్నారు. ఆఫ్రికా ఖండంతో భారతదేశ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలపై వారు చర్చించారు.

12. ఇథియోపియాలో విదేశాంగ మంత్రి పర్యటన ఫలవంతంగా సాగింది. 2025 డిసెంబర్‌లో గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇథియోపియాలో పర్యటించడం, అలాగే 2026 సెప్టెంబర్‌లో ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ భారత్‌లో పర్యటించిన నేపథ్యంలో, ఈ తాజా పర్యటన భారత్–ఇథియోపియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి నూతన ఊపునిచ్చింది.

న్యూఢిల్లీ

11 అక్టోబర్, 2026